క్లుప్తంగా

2న మండల మీట్

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మార్చి 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పద్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించిన ప్రాథమిక , ఇతర సమాచారాన్ని ఆయా శాఖాధికారులు ఈ నెల 28లోపు కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్ పర్సన్ ఎల్ఎం ఉమాదేవి సూచించారు. కళ్యాణదుర్గంలోని శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆమె గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులు పరిశీలించి, పాఠకుల సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. గ్రంథాలయ పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని సూచించారు. అనంతరం ఎల్ఎం ఉమాదేవి, మోహన్‌రెడ్డిని సన్మానించారు. ఉప గ్రంథాలయ అధికారిణి సుబ్బరత్నమ్మ, గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, పాఠకులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

కూడేరు: మండల కేంద్రంలో శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. ఏడాది పాటు ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయ దుకాణం ఏర్పాటుకు గత ఏడాది రూ.3.14 లక్షలకు జానకమ్మ దక్కించుకున్నారు. ప్రస్తుతం రూ.2.81 లక్షలకే వేలం పాడగా ఎండోమెంట్ అధికారులు వేలం నిలుపుదల చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 28వ తేదీ మళ్లీ వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు, ఆలయ సేవా కమిటీ సభ్యులు, ,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కంబదూరు: ఇంటర్ చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిక్కా బొమ్మప్ప సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27లోపు ఓపీ ఓపెన్ స్కూల్.ఏపీ.ఇన్ వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత కాపీని కళాశాలలో అందించాలన్నారు. వివరాలకు 8074153144 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గొర్రెల కాపరులకు అండగా ఉంటాం

కంబదూరు: నష్టపోయిన గొర్రెల కాపరులకు అండగా ఉంటామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం గొర్రెల కాపరులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. మండలంలోని వైసీపల్లిలో అగ్నిప్రమాదంలో 83 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం మంత్రి ఆదేశాల మేరకు కురుబ సంఘం నాయకులు మృతి చెందిన గొర్రెల కళేబారాలను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గొర్రెల కాపరులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భీమేష్, సెట్టూరు మండల కురుబ సంఘం అధ్యక్షుడు గొర్ల గంగాధర, కళ్యాణదుర్గం కురుబ సంఘం కార్యదర్శి కేశవగౌడ్, రాంపురం సర్పంచ్ చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం రూరల్: అదనపు కట్నం కోసం భర్త, అత్తామామల వేధింపులు భరించలేక మండలంలోని ఆర్బీవంక (బొందనకల్లు) గ్రామానికి చెందిన వివాహిత శోభారాణి శనివారం విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఇరుగుపొరుగు వారు వెంటనే ఆమెను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి బయటపడింది. మండలంలోని ఆవులదట్ల గ్రామానికి చెందిన తల్లిదండ్రులు తిప్పేస్వామి నాయక్, సరోజాబాయి ఈ సంఘటన పై ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం మే 25వ తేదీన ఆర్బీవంక గ్రామానికి చెందిన జోతీబాయి, గోపాల్ నాయక్ కుమారుడు వినోద్ నాయక్‌కు తమ కూతురును ఇచ్చి వివాహం చేశామన్నారు. కట్నంగా 13 తులాల బంగారం, రూ.2లక్షల నగదు ఇచ్చామన్నారు. అయినా భర్త, అత్తా మామలతో పాటు బావ భాస్కర్ నాయక్ కలసి రూ.5 లక్షలు తీసుకువస్తే ఇంట్లో ఉండు లేకపోతే చనిపో ... అంటూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. వేధింపులు భరించలేక మా కూతురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఘటనపై పోలీసులను విచారించగా.. విషయం తెలిసిందని అయితే కేసు నమోదు చేసుకోలేదు అని చెప్పడం విశేషం.

‘గడప గడప’తో ప్రగతి బాటలు

- ఏళ్ల నాటి మట్టి రోడ్లకు మోక్షం
- 18 సచివాలయాలకు రూ.3.60 కోట్ల నిధులు



30 ఏళ్ల తరువాత సీసీ రోడ్డుకు నోచుకున్న అజాద్ స్కూల్‌కు వెళ్లే దారి



12వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు ..

రాయదుర్గంటౌన్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కేవలం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా క్షేత్రస్థాయిలో అభివృద్ధి కూడా చేసి చూపించాలనే ఉద్దేశ్యంతో ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమం కింద ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల మేర నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో భాగంగానే రాయదుర్గం పట్టణంలో 18 సచివాలయాలకు గాను ఇప్పటికే 17 సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయింది. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.

18 సచివాలయాలకు నిధుల మంజూరు..

పట్టణంలోని 18 సచివాలయాలకు ‘గడప గడప’ కింద రూ.3.60 కోట్ల నిధులు మంజూరు చేయగా ఇప్పటి దాకా గుర్తించిన 50 సీసీ రోడ్ల పనులకు 7 రోడ్లను పూర్తి చేయగా మరికొన్ని టెండర్, టెక్నికల్ మంజూరు దశల్లో ఉన్నాయి. అనేక వార్డుల్లో ఏళ్ల తరబడి సీసీ రోడ్లకు నోచుకుని మట్టి రోడ్లకు ‘గడప గడప’తో మోక్షం లభించింది. పట్టణంలోని 17, 18వ వార్డు పరిధిలోని గుగ్గిరొట్టి కుబా మసీదు ప్రధాన రహదారి నుంచి అజాద్ స్కూల్‌కు వెళ్లే రహదారికి దాదాపు 40 ఏళ్ల తరవాత మోక్షం లభించడంతో కాలనీవాసుల ఆనందానికి అవధుల్లేవు. కాలనీవాసుల ఇబ్బందులు గుర్తించి సీసీ రోడ్డు వేయించిన ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 9వ వార్డు పరిధిలోని చౌడమ్మ ఆలయం వద్ద, కేబీ ప్యాలెస్ థియేటర్ పక్కన, ఇలా అవసరమైన చోట్ల ప్రాధాన్యత క్రమంలో గడప గడప కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు వేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సంతోషంగా ఉంది



ఏళ్ల తరబడి సీసీ రోడ్డు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గుంతలమయమైన రోడ్డుతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ‘గడప గడప’ కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు వేయించడం సంతోషంగా ఉంది. మా సమస్యను గుర్తించి సీసీ రోడ్డు వేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు.

– మేస్త్రీ అల్లాబకాష్, 18వ వార్డు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



కుందుర్పి: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు



ఉరవకొండ: మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటస్వామి



కూడేరు:మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

కుందుర్పి/ఉరవకొండ/కూడేరు/బ్రహ్మసముద్రం/కంబదూరు: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, ఆదిశగా ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని రూరల్ సీఐ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి సూచించారు. శనివారం కుందుర్పిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, దిశ యాప్, సైబర్ నేరాలు, చైల్డ్ రైట్స్, ఆన్‌లైన్ సేఫ్టీపై పోలీసు శాఖ అవగాహన కల్పించింది. చెడు అలవాట్ల బారిన పడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి, ఎస్ఎస్ఎస్ పీఓ ఉమామహేశ్వర్,అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఉరవకొండలోని ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ వెంకటస్వామి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘నీలి చిత్రాలు చూడడం-కలిగే అనర్థాలు’పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాసులు ప్రసాద్, మహిళా పోలీసులు రమణమ్మ, పుష్పా, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ పరుశురాముడు, ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. కంబదూరు మండలంలోని తిమ్మాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల్లో ఉత్తమ సేవలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఉత్తమ సేవలను అందిస్తున్నామని సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సంఘం సీఈఓ పాండురంగతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 500 మందికి పైగా రైతులు పంట రుణాలను తీసుకుని 99 శాతం రెన్యూవల్‌తో జిల్లాలోని ఉత్తమ సహకార సంఘాల్లో బెళుగుప్ప ఒకటిగా నిలిచిందన్నారు. రైతులకు ప్రస్తుతం ఎకరానికి రూ.39 వేల చొప్పున రుణలను అందిస్తున్నామన్నారు. సహకార సంఘంలో రుణాలు పొందిన ప్రతి రైతూ మార్చి 15లోగా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

ఘనంగా విశ్వ పుట్టిన రోజు వేడుకలు



ఉరవకొండ: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుడు బండారు వేమన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరవి, బ్యాళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, వడ్ల సలీం, ఫోటో ఫ్రేమ్ ఖాదర్‌బాషా, జీఎంఎస్ షాకీర్ తదితరులుపాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ పి.రాచన్నగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, సర్పంచులు మోనాలిసా, సురేంద్ర, మాజీ సర్పంచ్ వైద్యనాథ రెడ్డి, మండల కార్యదర్శి నల్లబోతులరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో శనివారం వజ్రకరూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు,వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు మాజీ ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సీనియర్ నాయకుడు మహానందరెడ్డి, యువజనవిభాగం అధ్యక్షుడు డిష్‌సురేష్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాకెట్లబాబు, ఎస్సీ సెల్ నాయకుడు ప్రభుదాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తీసుకొన్న తక్షణ చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గరుడచేడు నుంచి తాగునీటి సరఫరా అవుతోంది. పైప్‌లైన్ డ్యామేజ్, కరెంటు సమస్య కారణంగా ఇటీవల తుంబిగనూరుకు తాగునీరు సక్రమంగా రావడం లేదు. సర్పంచు ఫణీంద్ర సమస్యను విప్ దృష్టికి తీసుకెళ్లారు. విప్ ఆదేశాలతో అధికారులు శుక్రవారం బోరు వేయించగా సమృద్ధిగా నీరు పడ్డాయి. సర్పంచుతోపాటు స్థానిక నాయకులు ఆనంద్, లోకేషాచారి, కుమార్‌గౌడ్, చిదానంద, వార్డు మెంబర్‌లు వెంకటేష్, ఎర్రిస్వామి, రాజయ్య తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించండి

రాయదుర్గం రూరల్: మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై ఓటర్లకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని తహసీల్దార్ మారుతి బీఎల్ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో ఈడీటీ సుజాత అధ్యక్షతన శనివారం జరిగిన బీఎల్ఓల సమావేశంలో ఆయనతో పాటు ఏఈఆర్ఓ (మున్సిపల్ కమీషనర్) దివాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఈశ్వర్ , వీఆర్ఓ హరి పాల్గొన్నారు.

ఎల్పీజీ సిలిండర్‌తో బహుళ ప్రయోజనాలు

కణేకల్లు: ప్రభుత్వం కొత్తగా సరఫరా చేస్తున్న ఎల్పీజీ (కంపోసిట్) సిలిండర్‌తో బహుళ ప్రయోజనాలున్నాయని స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కె.సుధీర్ అన్నారు. కణేకల్లులోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం గ్యాస్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది రామరాజు, లోకేష్, సోము, కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు జీవనోపాధులకు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ ఈశ్వరయ్య

కూడేరు: డ్వాక్రా సంఘ సభ్యురాళ్లు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను జీవనోపాధులకు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం చెందాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఎన్ఆర్ఎల్ఎం స్కీంలో భాగమైన మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్(ఎంసీఎల్ఎఫ్) ద్వారా రాబోవు ఐదేళ్లలో వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సుస్థిర వ్యవసాయపరంగా ఆర్థిక బలోపేతం చెందడానికి లీడర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ పీడీ మాట్లాడుతూ తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించాలని సూచించారు.వచ్చే ఆదాయంతో జీవన శైలిని మెరుగు పరుచుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసుకోవాలని, పిల్లలను బాగా చదివించి బంగారు భవిష్యత్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్ గుప్తా, సీసీలు, లీడర్లు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో రజక వృత్తి చేస్తూ జీవనం సాగించే వెంకటేశులుకు చెందిన ఇంట్లో బీరువాను పగులగొట్టి రూ.70 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం శుభకార్యం నిమిత్తం కుటుంబంతో కలసి ఊరెళ్లాడు. శనివారం ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

కుందుర్పి: ‘నాడు-నేడు’ కింద ప్రభుత్వం పాఠశాలల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ ఓబుళపతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆంజనేయులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద నిర్మిస్తున్న అదనపు గదిని వారు పరిశీలించారు. అంతకు ముందు పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మితో కలసి వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, కోఆప్షన్ సభ్యుడు నారాయణస్వామి, వార్డు సభ్యురాలు దురగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బస్ షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ రామకృష్ణయ్య

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన రూ.60,000 ఖర్చుతో బస్ షెల్టర్‌ను దాత మద్దూరి ఎర్రిస్వామి సహకారంతో నిర్మించారు. శనివారం బస్ షెల్టర్‌ను ఎస్ఐ రామకృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు మద్దూరి సువర్ణమ్మ, ఎర్రిస్వామి దంపతులను ఆయన అభినందించారు.

కనుల పండువగా గ్రామోత్సవం

కుందుర్పి: గుడిబండ ఆంజనేస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం గంగపూజ, రాత్రికి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం కర్ణాటకలోని పరశురాంపురం వేదావతి నది వద్దకు స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, గొరవయ్యల నృత్య ప్రదర్శనలు, కీలుగుర్రాల నృత్యాలు, పలు పౌరాణిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. కాగా ఆదివారం ఉదయం 9 గంటలకు బ్రహోత్సవం సందర్భంగా రథంపై బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు హెలికాప్టర్ ద్వారా పూలు చల్లుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

బొమ్మనహాళ్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి సూచించారు. మండలంలోని గోనేహాళ్ గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంట్లో నీటి పాత్రలు, తొట్టెలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా చెత్తాచెదారం తొలగించాలని, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్‌గన్యా బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య కర్యకర్తలు వెంకటరమణ, గౌతమి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సును శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కె.అష్రాఫ్‌ఆలీ మాట్లాడుతూ 30 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఐటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, జావా, ఒరాకిల్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిరుద్యోగ యువతీ, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆలీ, అనిల్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జయలక్ష్మి , సీనియర్ అధ్యాపకుడు సురేష్‌బాబు పాల్గొన్నారు.

మద్దానేశ్వరాలయంలో అన్నదానం

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి రథోత్సవం, పశువుల జాతర సందర్భంగా ఏటాలాగే ఈ నెల 21 నుంచి మార్చి 1 వరకూ భక్తుల సహకారంతో మద్దానేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించారు. వైఎస్సార్సీపీ నాయకుడు రాయంపల్లి నగేష్ తన సొంతనిధులతో, మిత్రులతో కలిసి శనివారం అన్నదానం చేశారు. ఆయనను ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, అన్నదాన కమిటీ అధ్యక్షుడు జయణ్ణ సన్మానించారు. కార్యక్రమంలో రాయంపల్లి అంజి, దిలీప్, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాముల దగ్ధం

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుని దొడ్లలో నిల్వ ఉంచిన వరి గడ్డి, వేరుశగన పొట్టు వాములు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే గడ్డివాములు కాలిబూడిదయ్యాయి. పశువులకు మేత లేకుండా పోయిందని, సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పూజారి రామలింగప్ప, ధనుంజయ్య, పోలమ్మ వాపోయారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ

కళ్యాణదుర్గం: మండలంలోని పాపంపల్లి సమీపంలో శనివారం శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో సమీపంలోని పలువురు రైతుల టమాట పంటలు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న అధికారులు, సిబ్బంది నీటి వృథాను అరికట్టారు. అనంతరం లీకేజీ ఏర్పడిన ప్రదేశంలో మరమ్మతులు చేపట్టారు. మరమ్మత్తుల అనంతరం నీటిని యథావిధిగా సరఫరా చేశారు.

తక్షణ సాయం అందజేత

కంబదూరు: మండలంలోని జెక్కిరెడ్డిపల్లికి చెందిన సాకమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద శనివారం ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు అందజేశారు. మిగిలిన సొమ్ము వ్యక్తిగత ఖాతాలోకి జమవుతుందని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. వార్డు మెంబర్లు ఈరన్న, హనుమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, వలంటీర్ విజయ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఈఓ కె. విజయ్‌కుమార్, అర్చకుడు గుండుస్వామి ఆధ్వర్యంలో పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గురుసిద్దావధూతల రథోత్సవం



భక్తుల మధ్య రథోత్సవం సాగుతున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని నింబగల్లులో గురుసిద్దావధూతల స్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గురుసిద్దావధూతలు, భగళాముఖి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం పుష్పాలు, మామిడాకులతో అలంకరించిన రథాన్ని భక్తులు ముందుకు లాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ధర్మరక్షణ నిధి సేకరణలో భాగస్వాములు కావాలి

రాయదుర్గంటౌన్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మార్చి 12 వరకూ చేపట్టిన ధర్మరక్షణ నిధి సేకరణ కార్యక్రమంలో హిందువులు భాగస్వామ్యులై సహకారం అందజేయాలని వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్ కోరారు. శనివారం ధర్మరక్షణ సేకరణ కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. వీహెచ్‌పీ అనేక ధార్మిక, ఆచార, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆలయాల రక్షణ, గోవుల రక్షణ, మహిళల రక్షణ, ఉత్సవాలు, ఊరేగింపులు, పవిత్ర నదుల కోసం ఎన్నో పోరాటాలు చేయడంతోపాటు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు కొత్తపల్లి సిద్దప్ప, నాగభూషణం, మహేష్, నారాయణరావు, హనుమంతరాయుడు, రుద్రముని పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

వజ్రకరూరు: మండలంలోని ఎస్ఎస్‌పీతండా గ్రామంలోని జగనన్న కాలనీలో శనివారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. కాలనీలో 28 ఇళ్లు మంజూరవడంతో నిర్మాణపనులు వేగంగా సాగుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సర్పంచు కవితాభాయి కాలనీలో బోరు వేయించడంతోపా టు తాగునీటి పైపులైన్ పనులు కూడా పూర్తిచేశారు. శనివారం కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంక్యానాయక్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆంజనేయులునాయక్, గ్రామపెద్దలు జెమ్లా రాముడునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు అన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న బాలికల క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏపీ మోడల్ బాలికల జట్టుపై కరణం చిక్కప్ప బాలికల జట్టు విజయం సాధించింది. ప్రతిభ చాటిన క్రీడాకారులను హెచ్ఎం శ్రీనివాసులు, పీఈటీలు రమేష్, లత, కుళ్లాయిస్వామి, శ్రీనాథ్, కోచ్ హరినాథ్‌రెడ్డి తదితరులు అభినందించారు.